క్లుప్తంగా

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఏఈకి వినతి పత్రం అందిస్తున్న విద్యుత్ మీటర్ రీడర్స్

రుద్రవరం: విద్యుత్ శాఖలో పని చేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని విద్యుత్ మీటర్ రీడర్స్ డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం వారు తాము ఏప్రిల్ 1వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు ఆ శాఖ ఏఈ సునీల్‌కు నోటీసు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పదేళ్లుగా ఏపీఎస్పీడీసీఎల్ సంస్థలో బిల్లింగ్ చేస్తున్నామన్నారు. ప్రస్తుతం స్మార్ట్ మీటర్లు బిగిస్తుండటంతో తాము ఉపాధి కోల్పోయే అవకాశం ఉందన్నారు. న్యాయం చేయాలని సమ్మెబాట పట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మస్తాన్, సుబ్బయ్య, ప్రతాప్, సునీల్, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి చర్యలు



మున్సిపల్ పార్కును పరిశీలిస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని పార్కుల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటానని న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ టౌన్‌హాల్ పక్కన ఉన్న మున్సిపల్ పార్కును మంత్రి పరిశీలించారు. వాకర్స్‌తో మాట్లాడి పార్కులోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మునిసిపల్ పార్కును సకల సౌకర్యాలతో సుందరంగా తీర్చి దిద్దుతానన్నారు. ఆయన వెంట ఉర్దూ ఆర్ఐ అస్మోద్దీన్, అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

బొమ్మలసత్రం: నేటితరం విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ ఎస్ఐ సలామ్ ఖాన్ సూచించారు. శనివారం రవీంద్రపాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. 18 ఏళ్లు నిండని వారు వాహనాలను డ్రైవింగ్ చేయరాదన్నారు.

పర్వదిన వేళల్లోనూ విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

నంద్యాల(అర్బన్): ఉగాది, రంజాన్ పర్వదిన వేళల్లోనూ విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని నంద్యాల విద్యుత్ శాఖ డీఈ రమేష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ బిల్లుల చెల్లింపులకు కేంద్రాలు తెరిచి ఉంచబడుతాయని, వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించి సహకరించాలని కోరారు.

అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): మున్సిపాలిటీలో అవినీతి, అక్రమాలు హెచ్చుమీరాయని, బాధ్యులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎస్‌డీపీఐ నంద్యాల అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి కరీముల్లా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌తో పాటు సిబ్బంది అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటూ విధులు నిర్వహిస్తున్నారన్నారు. వంద సంవత్సరాలు చరిత్ర కలిగిన మున్సిపాలిటీలో అక్రమార్కులకు చోటు ఇవ్వరాదన్నారు. మున్సిపల్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలని కోరారు. లేని పక్షంలో ఎస్‌డీపీఐ ఆధ్వర్యంలో దశల వారీగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.



నంద్యాలలో పూజ సామగ్రి వస్తువులు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు



కిరాణం షాపుల వద్ద ...

ఉగాది శోభ

ఉగాది పండుగ సందడి ఊరూరా మొదలైంది. ఇప్పటికే పట్టణాలు, గ్రామాల్లో ఆలయాలు ముస్తాబయ్యాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు వాటి వద్ద ఏర్పాట్లు చేశారు. జిల్లా కేంద్రం నంద్యాల శనివారం కిటకిటలాడింది. పండుగకు అవసరమైన సరుకుల కొనుగోలుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పట్టణానికి చేరుకున్నారు. దీంతో గాంధీచౌక్, శ్రీనివాససెంటర్, సంజీవనగర్, టెక్కె, మార్కెట్‌యార్డు, సాయిబాబానగర్ తదితర ప్రాంతాల్లో వస్త్ర, కిరాణ, పూజ సామగ్రి విక్రయ దుకాణాలు కళకళలాడాయి.

–నంద్యాల(వ్యవసాయం)/దొర్నిపాడు



టెక్కె ప్రాంతంలో సుంకులమ్మ అమ్మవారు



ముస్తాబైన బైటిపేట ఆంజనేయ స్వామి గుడి



డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో పెద్దమ్మ ఆలయం వద్ద ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

7న మండలమీట్

దొర్నిపాడు: మండల సర్వసభ్య సమావేశం ఏప్రిల్ 7న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సావిత్రి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు.

2 నుంచి దివ్యాంగ పింఛన్ల పరిశీలన

శిరివెళ్ల: వచ్చే నెల 2వ తేదీ నుంచి దివ్యాంగ పింఛన్ల పరిశీలన ప్రారంభమవుతుందని ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బుద్ధిమాంద్యం, చెవిటి, మూగ, అంధ, శారీరక వైకల్యం పింఛన్లు పొందే వారు 2వ తేదీ నుంచి 11వ తేదీ వరకు నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో జరగనున్న పరిశీలనకు హాజరు కావాలన్నారు. ఆయా గ్రామ సచివాలయాల సిబ్బంది ద్వారా దివ్యాంగులకు నోటీసులు జారీ చేస్తున్నామన్నారు. మండలంలో 870 మంది నెలనెలా దివ్యాంగ పింఛన్లు పొందుతున్నారన్నారు.

31న బండలాగుడు పోటీలు

సంజామల: కానాల గ్రామంలో ఈనెల 31న రాష్ట్ర స్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కూడాల చంద్రశేఖర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. గెలుపొందిన వృషభాల యజమానులకు వరుసగా రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు బహుమతులు అందిస్తామన్నారు. ఆసక్తి గల వృషభాల యజమానులు 31 వతేది ఉదయం 6 గంటల లోపు రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

పెరిగిన పంచాయతీ ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

దొర్నిపాడు: మండల కేంద్రం దొర్నిపాడు పంచాయతీకి వేలం పాటలో ఆదాయం పెరిగింది. శనివారం మార్కెట్‌కు వేలం పాట నిర్వహించారు. గతేడాది రూ. 6.25లక్షలు పలకగా ఈ సారి రూ.7.07లక్షలు పలికింది. దీంతో గ్రామ పంచాయతీకి రూ.82 వేలు అదనంగా ఆదాయం వచ్చినట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగార్జున తెలిపారు.

వారపు సంత వేలం పాట

శిరివెళ్ల: మహదేవపురం గ్రామ పంచాయతీ వారంపు సంత వేలం పాటలు శనివారం జరిగాయి. డీఎల్‌పీఓ రాంబాబు పర్యవేక్షణలో సర్పంచ్ పెద్ది రమణయ్య అధ్యక్షతన జరిగిన ఈ పాటలో పంచాయతీకి ఆదాయం సమకూరింది. గత ఏడాది రూ.5.50 లక్షలు రాగా ఈ ఏడాది 6.51 లక్షల ఆదాయం సమకూరింది. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ ఉపాధ్యక్షుడు నరహరి, ఈఓఆర్‌డీ శ్రీనివాసశర్మ, పంచాయతీ కార్యదర్శి రమణభట్టు పాల్గొన్నారు.

పని భారం తగ్గించాలి



ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

రుద్రవరం: తమకు పని భారం తగ్గించి ఆరోగ్యంగా ఉండేలా చూడాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ భాగ్యలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. స్థానిక మండల పరిషత్ వద్ద శనివారం నిర్వహించిన మండల సర్వ సభ్య సమావేశానికి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులు హాజరయ్యారు. అక్కడ వారంతా గుమికూడి తాము ఓ సంఘంగా ఏర్పాటు కావాలని తీర్మానించుకున్నారు. వెను వెంటనే కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడిగా ఎ. పాములేటిని, ఉపాధ్యక్షుడిగా కె.అరవిందనాయక్, కార్యదర్శులుగా షాహినూర్, రామకృష్ణ, ఉప కార్యదర్శిగా శశికళ, కోశాధికారిగా జి.పాము లేటి, సభ్యులుగా ప్రభాకర్, నరసింహవర్మ, శివక్రిష్ణ, మహేష్, హరి క్రిష్ణ, ఆదిలక్ష్మి, కొడయ్య, గోపాల్, మల్లికార్జునరెడ్డి, మానికను ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ తమకు ఇతర శాఖల పనులు అప్పగిస్తుండటంతో పంచాయతీల్లో అభివృద్ధి పనులు కుంటు పడుతున్నాయని చెప్పారు.

శాంతినికేతన్ స్కూల్ కరస్పాండెంట్‌కు సన్మానం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన శాంతినికేతన్ కరస్పాండెంట్‌ను సుధాకర్‌ను శనివారం ప్రైవేటు పాఠశాలల పీఈటీలు ఘనంగా సన్మానించారు. పట్టణంలోని పీజీ కళాశాలలో రాష్ట్ర క్రీడాభారతి, నంద్యాల ప్రైవేటు పీఈటీలు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి హాజరై మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్‌కు సుధాకర్ ఉపాధ్యక్షుడిగా ఎన్నిక కావడం అభినందనీయమన్నారు. ఈయన భవిష్యత్తులో మరెన్నో పదవులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో క్రీడా భారతి సభ్యులు, ప్రైవేటు పాఠశాలల పీఈటీలు రాజా చక్రవర్తి, ఓబులేసు, కిరణ్, లక్ష్మీకాంత్, పుల్లయ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సుంకర ప్రసాద్‌కు ఉగాది పురస్కారం

నంద్యాల(వ్యవసాయం): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాహిత్య కళా రంగాల కళాకారులకు అందించే ప్రతిష్టాత్మక కళారత్న హంస ఉగాది పురస్కారానికి సుంకర రాజశేఖర్ ప్రసాద్ ఎంపికయ్యారు. ఈయన దాదాపు 40 సంవత్సరాలుగా నాటక రంగంలో కొనసాగుతూ నాటక రంగ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సుంకర రాజశేఖర్‌ప్రసాద్‌కు ఉగాది పురస్కారం లభించడంతో పట్టణ ప్రముఖులు, కళాభిమానులు ఆయనకు అభినందనలు తెలిపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైలంటెంపుల్: ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం శ్రీశైల జగద్గురు సేవా సమితి ఆధ్వర్యంలో పలు ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, సంప్రదాయ నృత్యం, శివనామ భజన కార్యక్రమాలు నిర్వహించారు. విజయపురకు చెందిన అకాశ్ మంగులి వారి కన్నడ భక్తి రంజని, ప్రసిద్ధ నేపథ్య గాయనీగాయకులచే భక్తి సంగీత విభావరి, నందికొట్కూర్‌కు చెందిన సాయి లిక్షితాశ్రీ నృత్య కళాశాల వారి కూచిపూడి నృత్యప్రదర్శన, అనంతపురం అధ్యలక్ష్మి వారి సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమాలు అలరించాయి.

సబ్‌జైలు ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న జడ్జి వాసు

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల సబ్‌జైలును శనివారం మూడవ అదనపు జిల్లా జడ్జి వాసు ఆకస్మిక తనిఖీ చేశారు. జైలు ఆవరణ, ఖైదీల గదులను పరిశీలించి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖైదీల హాజరు పట్టికను పరిశీలించి వారి ఆరోగ్యంపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుటుంబాలను దృష్టిలో ఉంచుకొని సత్ప్రవర్తనతో మెలగాలని ఖైదీలను సూచించారు. కేసులు వాదించడానికి జైలుకు ప్రత్యేక ప్యానల్ న్యాయవాదిని ఏర్పాటు చేశామని, ఎటువంటి రుసుము లేకుండా న్యాయ సహాయం అందజేస్తారన్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ గురుప్రసాదరెడ్డి, కోర్టు సిబ్బంది రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా మండల మీట్



రెవెన్యూ శాఖ నివేదిక చదివి వినిపిస్తున్న తహసీల్దారు,



అధికారులు వెళ్లి పోవడంతో ఖాళీగా కుర్చీలు

రుద్రవరం: ఇది వరకు మండల సర్వసభ్య సమావేశం అంటే వాడీవేడిగా సాగేది. ప్రజాప్రతినిధులు వివిధ ప్రజా సమస్యలు లేవనెత్తితే..వాటికి అధికారులు సమాధానాలు చెప్పలేక ఉక్కిరిబిక్కిరి అయ్యేవారు. అయితే, శనివారం మండల పరిషత్ భవనంలో జరిగిన సమావేశంలో అలాంటిదేమి కనిపించలేదు. హాజరైన సభ్యుల్లో ఒకరు ఇద్దరు తప్ప అందరు మిన్నకుండి పోయారు. అధికారులు సైతం తమ శాఖలకు సంబంధించి ప్రగతి నివేదికలు చదివి తమకు వేరే పనులు ఉన్నాయని వెళ్లి పోయారు. 11.30 గంటలకు ప్రారంభమైన సమావేశం 12.30 గంటలకు అంటే గంటలోనే ముగిసింది. ఈ సమావేశానికి ఎంపీపీ బాలస్వామి అధ్యక్షత వహించారు. ఎంపీడీఓ భాగ్యలక్ష్మి, ఎంఈఓ వీర రాఘవయ్య, విద్యుత్ ఏఈ సునీల్ కుమార్, వ్యవసాయ శాఖ ఏఓ సుమతి, పశు వైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యం, గృహ నిర్మాణాల ఏఈ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గౌరవ వేతనాలు ఇస్తేనే మండలమీట్‌కు వస్తాం

తమకు పెండింగ్ గౌరవ వేతనం అందిస్తేనే మండల సర్వ సభ్య సమావేశానికి హాజరవుతామని లేదంటే ఇళ్లకు వెళ్లి పోతామని ఎంపీటీసీలు కాశన్న, కిరణ్‌కుమార్‌తో పాటు మరో ముగ్గురు శనివారం మండల పరిషత్ భవనంలో భీష్మించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇది మూడో మండల సర్వ సభ్య సమావేశమని ఇంత వరకు గౌరవ వేతనం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీడీఓ భాగ్యలక్ష్మి వారితో మాట్లాడారు. గౌరవ వేతనానికి సంబంధించిన బిల్లులు చేసి పంపామని, ప్రస్తుతం ప్రభుత్వం దగ్గరే పెండింగ్ ఉందని చెప్పారు. ఏదిఏమైనా ఈ విషయాన్ని మరోసారి జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పడంతో వారు శాంతించి మండలమీట్‌కు హాజరయ్యారు.

ఇఫ్తార్ విందుకు స్పందన కరువు





ఇఫ్తార్ విందుకు నామమాత్రంగా హాజరైన ముస్లింలు, విందు స్వీకరిస్తున్న మంత్రి, కలెక్టర్, జేసీ

నంద్యాల(అర్బన్): రంజాన్ పండుగను పురస్కరించుకొని స్థానిక మున్సిపల్ టౌన్ హాల్‌లో మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. తొలుత రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ హాజరుకాగా జిల్లా కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ ఇఫ్తార్ విందు ఆరంభమైన తర్వాత వచ్చారు.అయితే, వక్ఫ్ చట్ట సవరణ బిల్లు విషయంలో కూటమి ప్రభుత్వం తీరును నిరసిస్తూ నంద్యాల ముస్లిం జేఏసీ నాయకులు ప్రభుత్వ ఇఫ్తార్ విందును బహిష్కరించాలని పిలుపునివ్వడంతో స్థానిక ముస్లింలు, మత పెద్దలు ఆశించిన మేర హాజరు కాలేదు. ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఏఎస్పీ జావలి ఆల్ఫోన్స్, మైనార్టీ సంక్షేమ అధికారిణి సబిహా పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకల సమయంలో అప్రమత్తంగా ఉండండి



మారెమ్మ గుడిని పరిశీలిస్తున్న డీఎస్పీ ప్రమోద్

శిరివెళ్ల: ఉగాది వేడుకల సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని డీఎస్పీ ప్రమోద్ పోలీసు సిబ్బందిని ఆదేశించారు. శనివారం స్థానిక పోలీస్టేషన్‌లో సీఐ వంశీధర్, ఎస్ఐ చిన్న పీరయ్య, సిబ్బందితో ఆయన సమావేశమై మాట్లాడారు. మండల కేంద్రం శిరివెళ్లలో రెండు సామాజిక వర్గాల మధ్య గొడవలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వేడుకలు జరిగే ప్రధాన మార్గాలలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. సర్కిల్ పరిధిలోని పోలీస్ బందోబస్తును నియమించుకోవాలన్నారు. వేడుకలు ముగిసే వరకు సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలన్నారు. రంజాన్ పండుగ రోజు కూడ అప్రమత్తంగా ఉండాలన్నారు. మసీదులు, ఈద్గా వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మత సామరస్యాన్ని కాపాడేందుకు శాంతి కమిటీ సమావేశం ఏర్పాటు చేసి వారికి తగిన సూచనలు చేశామని డీఎస్పీకి సీఐ వివరించారు. అనంతరం డీఎస్పీ మారెమ్మ గుడిని,అక్కడ కల్పించిన ఏర్పాట్లను పరిశీలించారు.

చౌడేశ్వరిదేవి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



ఆలయం ప్రధాన గోపురం వద్ద భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలువ పందిరి

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయంలో 30 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ శనివారం తెలిపారు. ఇప్పటికే భక్తులకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేయడంతో పాటు వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని టెంట్లను ఏర్పాటు చేశామన్నారు. అలాగే భక్తులకు తాగునీటి సౌకర్యం, మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్లు, స్నానపుగదులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భక్తులకు సుమారు 40 వేల వరకు లడ్డూ ప్రసాదాలను ప్రత్యేకంగా తయారు చేసి సిద్ధంగా ఉంచామన్నారు. ఇంకా దాతల సహకారంతో భక్తులకు మజ్జిగ నిమ్మరసాయల పంపిణికి చర్యలు తీసుకుంటునట్లు వెల్లడించారు. భక్తుల సౌకర్యార్థం బనగానపల్లె ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పూజా కార్యక్రమాలు..

ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం అమ్మవారికి గణపతి పూజ, పుణ్యాహవాచనం, సాయంత్రం అంకురార్పణ, పంచాగశ్రవణం, పన్నేరపు బండ్లు తిప్పుట, ప్రాకార రథోత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ తెలిపారు. 31న శ్రీ దేవి,భూదేవి సమేత చెన్నకేశ స్వామి కళ్యాణోత్సవం, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, ఏప్రిల్ 1న సాయంత్రం అమ్మవారి రాయబార మహోత్సవం, రాత్రి పౌరాణిక నాటక ప్రదర్శన, 2వ తేదీ అమ్మవారికి సహస్రనామార్చన, పసుపు కుంకుమ పట్టువస్త్రముల అలంకరణ, రాత్రి 12 గంటలకు భాస్కరయ్య ఆచారిచే అమ్మవారికి దిష్టిచుక్క పెట్టు కార్యక్రమం అనంతరం చౌడేశ్వరిదేవి జ్యోతి మహోత్సవం, 3న సాయంత్రం అమ్మవారి రథోత్సవం(పోవడం), 4న రథోత్సవం (రావడం), 5వ తేదీ ఉదయం వసంతోత్సవంతో జ్యోతి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వెల్లడించారు.

మహానంది బహిరంగ వేలాల్లో బాహాబాహీ

- మొదటగా రెండు వర్గాల మధ్య గొడవ
- మరోసారి కుర్చీలతో కొట్టుకున్న మరో రెండు వర్గాలు



గొడవ పడుతున్నవారిని నిలువరిస్తున్న పోలీసులు

మహానంది: మహానందిలో జరిగిన బహిరంగ వేలాల్లో ఉద్రిక్తత చోటు చేసుకుంది. రెండు వర్గాల మధ్య వాగ్వాదంతో పాటు మరో రెండు వర్గాల మధ్య ముదిరిన వివాదం కాస్త కుర్చీలతో కొట్టుకునే వరకు వెళ్లింది. మహానందిలోని బీఎస్ఎన్ఎల్ టవర్ నుంచి కరివేన సత్రం వరకు, టీటీడీ కల్యాణ మండపం కాంపౌండ్ ముందు భాగంలో ఉన్న ఖాళీ స్థలాల్లో షాపులు నిర్వహించుకునేందుకు శనివారం ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పోచా బ్రహ్మనందరెడ్డి డార్మెటరీ భవనంలో బహిరంగ వేలాలు నిర్వహించారు. ముందుగా కొబ్బరిచిప్పల సేకరణ, పాదరక్షలు భద్రపరుచుకునే అంశాలకు సీల్డు, బహిరంగ వేలాలు జరిగాయి. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న సుమారు 50కి పైగా ఖాళీ స్థలాల్లో షాపులు పెట్టుకునేందుకు మొదలయ్యాయి. ప్రస్తుతం షాపులు నిర్వహించుకుంటూ జీవనోపాధి పొందుతున్న వారు నెలకు ఇచ్చే అద్దెలకు కొంత మొత్తం పెంచి దేవస్థానానికి చెల్లిస్తే ఎవరి షాపులు వారే నిర్వహించుకునేలా నిర్ణయించారు. కానీ అలా గాకుండా కొందరు కావాలనే పోటీకి వెళ్లడంతో వ్యాపారుల మధ్య వివాదం మొదలైంది. మొదటగా జరిగిన వేలాల్లో డిపాజిట్లు కట్టి వేలాలకు వచ్చిన అనిమెల శివయ్య, దేవేంద్ర మరికొందరి మధ్య వివాదం మొదలు కావడంతో పోలీసులు వారిని వారించారు. ఇదిలా ఉండగా టీటీడీ కల్యాణ మండపం వద్ద 43వ నంబరు ప్లాటు(ఖాళీ స్థలం)ను ముందుగా గిరిజన యువకుడికి అనుకున్నారు.. కానీ ఓ వర్గం పోటీకి రావడంతో వివాదం మొదలై కుర్చీలతో కొట్టుకునే వరకు వెళ్లింది. మహానందికి చెందిన భూమా సుబ్బరామయ్య, సోదరులు, మరో వర్గం భవనాశి రమణయ్యల మధ్య గొడవ జరిగింది. ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి అక్కడకు చేరుకుని ఇరువర్గాల మధ్య వివాదాన్ని సద్దుమణిగించడంతో పరిస్థితులు అదుపులోకి వచ్చాయి.

వేలం ద్వారా రూ.27.49 లక్షలు ఆదాయం

కొబ్బరిచిప్పలు ప్రోగు చేసుకునే హక్కును రూ.18,09,999కు మహానందికి చెందిన రాజలింగేశ్వరయ్య దక్కించుకున్నారు. బీఎస్ఎన్ఎల్ టవర్ సమీపంలో ఉన్న మరుగుదొడ్ల నిర్వహణ హక్కును రూ.9,40,000కు మహేష్ పొందారు. ఈ రెండికి రూ.27.49లక్షల ఆదాయం వచ్చిందని స్థలాల్లో షాపుల నిర్వహణ ద్వారా మరికొంత ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు.